# ఉన్నత స్థాయిలో ఆ నాలుగు సంస్థలు

**జాతీయ స్థాయిలో రాష్ట్రానికి గుర్తింపు**

**భువనేశ్వర్:** జాతీయస్థాయిలో రాష్ట్రం నుంచి నాలుగు విద్యాసంస్థలు తొలి 100 ఉత్తమ విద్యా సంస్థల జాబితాలో స్థానం సాధించాయి. ఈ జాబితాలో శిక్ష్యా ఓ అనుసంధాన్ (ఎస్‌ఓఏ) విశ్వవిద్యాలయం-భువనేశ్వర్, నేషనల్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ (నిట్)-రౌర్కెలా, ఇండియన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ-భువనేశ్వర్, కళింగ ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఇండస్ట్రియల్ టెక్నాలజీ (కిట్), భువనేశ్వర్ చోటుదక్కించుకున్నాయి. కేంద్ర మానవ వనరుల విభాగం ఆధ్వర్యంలో నేషనల్ ఇనిస్టిట్యూషనల్ ర్యాంకింగ్ ఫ్రేమ్‌వర్క్( ఎన్‌ఐఆర్‌ఎఫ్) జాతీయ స్థాయిలో తొలి 100 ఉత్తమ విద్యా సంస్థల జాబితాను విడుదల చేసింది. రాష్ట్రం నుంచి శిక్ష్యా ఓ అనుసంధాన్ (ఎస్‌ఓఏ) విశ్వవిద్యాలయం-భువనేశ్వర్ జాతీయ స్థాయిలో 33వ స్థానం సాధించింది. నేషనల్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ(నిట్)-రౌర్కెలా 46వ స్థానం సాధించగా ఇండియన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ-భువనేశ్వర్, కళింగ ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఇండస్ట్రియల్ టెక్నాలజీ(కిట్) విశ్వవిద్యాలయం, భువనేశ్వర్ సంస్థలు క్రమంగా 66, 79 స్థానాల్లో చోటు సంపాదించాయి. .



కళింగ ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఇండస్ట్రియల్ టెక్నాలజీ (కిట్)




ఇండియన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ, భువనేశ్వర్

## ఇంజినీరింగ్‌లో నిట్, రౌర్కెలా ముందంజ

జాతీయ స్థాయి ఉత్తమ ఇంజినీరింగ్ విద్యా సంస్థల జాబితాలో రాష్ట్రం నుంచి 4 విద్యాసంస్థలు స్థానం సొంతం చేసుకోవడం విశేషం. ఇంజినీరింగ్ విభాగంలో నేషనల్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజి (నిట్)-రౌర్కెలా జాతీయ స్థాయిలో 12వ స్థానాన్ని కైవసం చేసుకుంది. ఇండియన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ-భువనేశ్వర్ తదుపరి స్థానంలో నిలిచింది. జాతీయ స్థాయిలో ఈ సంస్థకు 18వ స్థానం లభించింది. స్థానిక కళింగ ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఇండస్ట్రియల్ టెక్నాలజి (కిట్) 47వ స్థానంతో జాతీయ స్థాయి జాబితాలో చోటుచేసుకోగా సి. వి. రామన్ కాలేజ్ ఆఫ్ ఇంజినీరింగ్ 92వ స్థానంలో నిలిచింది.

## మేనేజ్‌మెంట్‌లో కిట్‌ది పైస్థాయి

రాష్ట్రం నుంచి ఎంపికైన మేనేజ్‌మెంట్ విద్యా సంస్థల్లో కళింగ ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఇండస్ట్రియల్ టెక్నాలజీ(కిట్), భువనేశ్వర్ అగ్ర స్థానంలో నిలిచింది. జాతీయ స్థాయి ఉన్నత మేనేజ్‌మెంట్ విద్యాసంస్థల్లో ఈ సంస్థకు 22వ స్థానం లభించింది. ఈ విభాగంలో స్థానిక జేవియర్ యూనివర్సిటీ 33వ స్థానంలో నిలిచింది. రాష్ట్రంలో ఉన్నత మేనేజ్‌మెంట్ విద్యాసంస్థల్లో ఈ రెండు సంస్థలకు మాత్రమే స్థానం లభించడం విశేషం.

## విశ్వవిద్యాలయాల్లో ఎస్‌ఓఏ

జాతీయ స్థాయి ఉన్నత విశ్వవిద్యాలయాల జాబితాలో రాష్ట్రం నుంచి రెండు సంస్థలు స్థానం చేజిక్కించుకున్నాయి. ఈ జాబితాలో శిక్ష్యా ఓ అనుసంధాన్ (ఎస్‌ఓఏ) విశ్వవిద్యాలయం-భువనేశ్వర్, కళింగ ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఇండస్ట్రియల్ టెక్నాలజీ (కిట్) విశ్వవిద్యాలయం, భువనేశ్వర్ ఉన్నాయి. జాతీయ ఉన్నత విశ్వవిద్యాలయాల జాబితాలో స్థానిక శిక్ష్యా ఓ అనుసంధాన్ (ఎస్‌ఓఏ) విశ్వవిద్యాలయం 20వ స్థానం సాధించగా కళింగ ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఇండస్ట్రియల్ టెక్నాలజీ(కిట్) విశ్వవిద్యాలయం 49వ స్థానం సాధించింది.

## అన్నింటా కిట్

నేషనల్ ఇనిస్టిట్యూషనల్ ర్యాంకింగ్ ఫ్రేమ్‌వర్కు (ఎన్‌ఐఆర్‌ఎఫ్) విశ్లేషణ జాబితాలో స్థానిక కళింగ ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఇండస్ట్రియల్ టెక్నాలజీ(కిట్) విశ్వవిద్యాలయం బహుముఖ వర్గాల్లో స్థానం సాధించింది. విశ్వవిద్యాలయం, మేనేజ్‌మెంట్, ఇంజినీరింగు విభాగాల్లో వేర్వేరుగా రాష్ట్రం నుంచి జాతీయ స్థాయి ర్యాంకింగ్‌ను సాధించిన ఏకైక విద్యా సంస్థగా కిట్ ప్రత్యేకత సాధించడం విశేషం.

## ఉన్నతస్థానానికి చేరుతున్నాం

ఐఐటీ డైరెక్టర్



ఐఐటీ-భువనేశ్వర్ డైరెక్టర్ ప్రొఫెసర్ ఆర్‌వి రాజ్‌కుమార్.

**భువనేశ్వర్:** ఇంజినీరింగ్ విద్యా సంస్థల జాతీయ స్థాయిలో ఉన్నత స్థానానికి స్థానిక ఇండియన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ (ఐఐటీ-భువనేశ్వర్) చేరుకుంటోంది. నేషనల్ ఇనిస్టిట్యూషనల్ ర్యాంకింగ్ ఫ్రేమ్‌వర్కు (ఎన్‌ఐఆర్‌ఎఫ్) వెల్లడించిన జాతీయ ఉన్నత ఇంజినీరింగ్ విద్యా సంస్థల్లో సంస్థకు 18వ స్థానం లభించింది. గత ఏడాది ఈ ర్యాంకింగ్ ప్రకారం 26వ స్థానం లభించింది. అంచెలంచెలుగా ఈ సంస్థ జాతీయ స్థాయిలో అత్యున్నత స్థాయికి చేరువవుతున్న ఫలితాలు కనిపిస్తున్నాయని ఐఐటీ-భువనేశ్వర్ డైరెక్టర్ ప్రొఫెసర్ ఆర్. వి. రాజ్‌కుమార్ తెలిపారు. సమకాలీన (2008 సంవత్సరంలో ప్రారంభించబడిన ) ఇండియన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ సంస్థల జాతీయ జాబితాలో తమకు మూడో స్థానం లభించడం విశేషంగా పేర్కొన్నారు. గత ఏడాది ఈ జాబితాలో తమ సంస్థ అట్టడుగు స్థానానికి పరిమితమైన విషయాన్ని గుర్తు చేశారు. గత 3 విద్యా సంవత్సరాల పురోగతి ఆధారంగా నేషనల్ ఇనిస్టిట్యూషనల్ ర్యాంకింగ్ ఫ్రేమ్‌వర్కు (ఎన్‌ఐఆర్‌ఎఫ్) ఏటా ఈ జాబితా వెల్లడిస్తుందని వివరించారు. అతి త్వరలో ఐఐటీ-భువనేశ్వర్‌కు పేరొందిన అగ్ర సంస్థల జాబితా స్థాయికి చేర్చేందుకు కృషి చేస్తున్నట్లు డైరెక్టర్ ప్రొఫెసర్ ఆర్.వి. రాజ్‌కుమార్ వివరించారు. 2015వ సంవత్సరం నుంచి ఈ సంస్థ డైరెక్టరుగా ఆయన బాధ్యతలు చేపట్టారు. తాజా ఫలితాలు కొత్త కార్యాచరణను ప్రేరేపించినట్లు ఆయన అభిప్రాయపడ్డారు. బోధన, అభ్యాసం, పరిశోధన, వృత్తిపరమైన విధానాలు, గ్రాడ్యుయేట్ల ఉత్పాదనల్ని పరిగణనలోకి తీసుకుని నేషనల్ ఇనిస్టిట్యూషనల్ ర్యాంకింగ్ ఫ్రేమ్‌వర్క్ (ఎన్‌ఐఆర్‌ఎఫ్) జాతీయ ఉన్నత స్థాయి విద్యా సంస్థల జాబితాను ఖరారు చేస్తుందని వివరించారు.